'నిథమ్‌' లైబ్రేరియన్‌ యాదగిరికి పీహెచ్‌డీ



రాయదుర్గం: గచ్చిబౌలిలోని 'నిథమ్‌'లో లైబ్రేరియన్‌ డాక్టర్‌ నీరుడి యాదగిరికి పీహెచ్‌డీ ప్రదానం చేశారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ వి నారాయణన్‌, వీసీ కుమార్‌ చేతుల మీదుగా పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నారు. డా.యాదగిరి ఉస్మానియా యూనివర్సిటీలోని లైబ్రరి అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సైన్స్‌ విభాగం నుంచి 'యూజ్‌ ఆఫ్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ ఇన్‌ టూరిజమ్‌ అండ్‌ హాస్పిటాలిటీ లైబ్రరీస్‌ ఇన్‌ తెలంగాణ స్టేట్‌: ఏ స్టడీ' అనే అంశంపై డీఈఎస్‌ఐడీఓసీ డైరెక్టర్‌ డాక్టర్‌ కె నాగేశ్వరరావు పర్యవేక్షణలో పూర్తి చేశారు. డాక్టర్‌ యాదగిరిని నిథమ్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకటరమణ, ఇన్‌చార్జీ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ గణేష్‌,ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

విపత్తులు.. ప్రతి స్పందనపై అవగాహన కలిగి ఉండాలి

పటాన్‌చెరు టౌన్‌: విపత్తులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ అన్నారు.మంగళవారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం, శ్రీ సత్యసాయి సేవ ఆర్గనైజేషన్‌ సంయుక్తంగా 'విపత్తు నిర్వహణపై 'ఒక రోజు వర్క్‌షాపును నిర్వహించారు.ఈ వర్క్‌షాప్‌కి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. పనితీరుకు ఆటంకం కలిగించే అంతరాయమే విపత్తుగా పరిగణిస్తామని ,ఈ విపత్తులు అనేక రకాలుగా ఉంటాయని ప్రకృతి విపత్తులు, మానవ నిర్మితమైన విపత్తుల వల్ల అనేక అవాంతరాలు ఏర్పడతాయన్నారు. నీటి , భౌగోళిక , మానవ నిర్మిత ,జీవ సంబంధిత, పారిశ్రామిక విపత్తులు ఏర్పడతాయని అవి సంభవించినప్పుడు ప్రతిస్పందించే విధానం, వాటి దశలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి విపత్తు నిర్వహణ కమిటీ ఇంచార్జ్‌ శ్రీకృష్ణకుమార్‌ మాట్లాడుతూ... విపత్తులు ఆర్థికంగా, పర్యావరణంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో పీపీటీ ద్వారా వివరించారు.

విద్యుత్‌ లైన్ల కింద గణేశ్‌ మండపాలను ఏర్పాటు చేయొద్దు..

గచ్చిబౌలి డీఈ యాదగిరి



చందానగర్‌: విద్యుత్‌ తీగల కింద గణేశ్‌ మండపాలను ఏర్పాటు చేయొద్దని గచ్చిబౌలి డివిజన్‌ ఇంజనీర్‌ పి.యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం చందానగర్‌ ఏడీఈ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండపాలపై ఇనుపరేకులు కాకుండా, ఫైబర్‌వి ఉపయోగించాలన్నారు. మండపాలు, రోడ్లపై అలంకరణల సమయంలో తాత్కాలిక విద్యుత్‌ వైరింగ్‌ను ఎంసీబీతో అనుసంధానం చేయాలన్నారు. నాసిరకం కాకుండా ఐఎస్‌ఐ బ్రాండు తీగలు వినియోగించాలని, వైర్లు పగుళ్లు రాకుండా ఇన్సులేషన్‌ టేపు వేయాలన్నారు. వినాయక ప్రతిమలు మండపానికి తెచ్చే సమయంలో, నిమజ్జనానికి తరలించే సమయంలో విద్యుత్‌ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. వినాయక మండపం, అలంకరణలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గచ్చిబౌలి సబ్‌ డివిజన్‌ పరిధిలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటే కింది నంబర్లను సంప్రదించవచ్చు

- డీఈ గచ్చిబౌలి : 87124 69627
- ఏడీఈ చందానగర్‌ : 87124 69629
- ఏఈ చందానగర్‌ : 87124 69634
- ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (చందానగర్‌) : 87124 69655
- ఏఈ గచ్చిబౌలి : 87124 69631
- ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (గచ్చిబౌలి) : 87124 69652
- ఏఈ నల్లగండ్ల : 87124 69633
- ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (నల్లగండ్ల) : 87124 69654
- ఏఈ తారానగర్‌ : 87124 69632
- ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (తారానగర్‌) : 87124 69653
- ఏఈ హఫీజ్‌పేట్‌ : 87124 69636
- ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (హఫీజ్‌పేట్‌) : 87124 69657
- ఏఈ వసంతనగర్‌ : 87124 69635
- ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ (వసంతనగర్‌) : 87124 69656

కేబుల్‌ వైర్లు తొలగింపు



కేబుల్‌ వైర్లను తొలగింప చేస్తున్న అధికారులు

మియాపూర్‌ : విద్యుత్‌ స్తంభాలకు వేలాడుతున్న, చుట్టిన ఇంటర్నెట్‌ కేబుల్‌ వైర్లను విద్యుత్‌ అధికారులు తొలగించారు. మంగళవారం మియాపూర్‌లోని కాలనీ, బస్తీలలో, ప్రధాన అంతర్గత రహదారుల వెంబడి విద్యుత్‌ స్తంభాలకు కట్టిన వైర్లు, తీగలను మియాపూర్‌ విద్యుత్‌ శాఖ అధికారులు తొలగించారు. రామంతాపూర్‌లో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా అధికారులు చర్యలు ప్రారంభించారు. మియాపూర్‌ మదీనగూడ సబ్‌ స్టేషన్‌, మయూరినగర్‌ సబ్‌స్టేషన్‌ పరిదిలో ఏఈ శ్రీనివాస్‌ రెడ్డి, ఏఈఈ రవిచంద్ర ఆధ్వర్యంలో కేబుల్‌ తీగల తొలగింపు చేపట్టారు. మరలా తీగలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

చైన్‌స్నాచర్‌ అరెస్ట్‌.. రిమాండ్‌

మియాపూర్‌ : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుండి బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన చైన్‌స్నాచర్‌ను మియాపూర్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి అతని వద్దనుండి 26 గ్రాముల బంగారు పుస్తెలతాడును స్వాధీనం చేసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. డీఐ రమేష్‌ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్‌ కాలనీకి చెందిన లోకిరెడి బాలాకుమారి ఈ నెల 4వ తేదీ సాయంత్రం నాగార్జున ఎన్‌క్లేవ్‌ కాలనీలోని స్కూల్‌ నుండి తన కుమారుడిని తీసుకుని నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుండి వచ్చిన వ్యక్తి బాలాకుమారి మెడలో నుండి చైన్‌ లాక్కొని పరారయ్యాడు. ఆమె మియాపూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు.దర్యాప్తులో భాగంగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన మియాపూర్‌ కాండ్యూర్‌ నిర్మాణ సంస్థల్లో పెయింటర్‌గా పనిచేస్తున్న బ్రిజేష్‌ చౌహాన్‌(20)ను మంగళవారం మియాపూర్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. బ్రిజేష్‌ గత కొంతకాలంగా ఆన్‌లైన్‌ బెట్టింగ్‌ గేమ్‌లు, జల్సాలకు అలవాటు పడి పనిచేయగా వచ్చిన డబ్బులు చాలకపోవడంతో దొంగతనాలకు పాల్పడుతున్నాడు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



చందానగర్‌ : ఆర్టీసీ బస్‌ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చందానగర్‌ ఫ్లైఓవర్‌ సమీపంలో 18వ తేదీ రాత్రి 8.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి (55) మద్యం మత్తులో రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు– సీబీఎస్‌ ఆర్టీసీ బస్‌ (టీఎస్‌08జెడ్‌0170) ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు డయల్‌ 100కి కాల్‌ చేయగా వెంటనే చందానగర్‌ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి ప్యాంటులో మద్యం సీసా ఉండడం గమనించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గణేశ్‌ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మియాపూర్‌ ఏసీపీ శ్రీనివాసకుమార్‌

శేరిలింగంపల్లి: గణేశ్‌ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మియాపూర్‌ ఏసీపీ సీహెచ్‌వై శ్రీనివాస్‌కుమార్‌ సూచించారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని శేరిలింగంపల్లిలో మంగళవారం శాంతి (పీస్‌) కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని ముఖ్యంగా విద్యుత్‌ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై గుంతలు, చెట్లకొమ్మలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకువస్తే జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల ఏర్పాటు విషయాన్ని సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.ఇన్‌స్పెక్టర్‌ విజయ్‌ మాట్లాడుతూ మండప నిర్వాహకులుఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా ఏర్పాటు చేస్తే సీజ్‌ చేస్తామని స్పష్టం చేశారు. నిమజ్జనాన్ని ముందు అందజేసిన సమాచారం ప్రకారమే చేసి పోలీసులకు సహకరించాలని కోరారు. నిమజ్జనం ఊరేగింపు, ఇతర కార్యక్రమాల్లో చిన్నారులను దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ విద్యాసాగర్‌రెడ్డి, చందానగర్‌ సర్కిల్‌ ఏఎంసీ కృష్ణ, కాలనీవాసులు అజయ్‌కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, విక్రాంత్‌, నగేష్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌' ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కొమిరిశెట్టి సాయిబాబా తదితరులు

చందానగర్‌ : ఈ నెల 24వ తేదిన నిర్వహించనున్న శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కూకట్‌పల్లి కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, వివేకానందనగర్‌ కార్పొరేటర్‌ రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావులు పిలుపునిచ్చారు. మంగళవారం మియాపూర్‌ ఆల్విన్‌ కాలనీ చౌరస్తాలోని అతిథి హోటల్‌లో నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ ముఖ్యనాకుల ఆత్మీయ కలయికను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడు బీఆర్‌ఎస్‌ పార్టీలో నిఖార్సయిన ఉద్యమకారులు ఉన్నారన్నారు.కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అటు బీఆర్‌ఎస్‌ ఇటు కాంగ్రెస్‌ అంటూ నాటకాలాడుతున్నారన్నారు. త్వరలోనే కొంత మందిపై అనర్హత వేటు పడుతుందని, అందులో భాగంగానే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉపఎన్నిక జరగనుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పురుషోత్తం యాదవ్‌, మారబోయిన రవి యాదవ్‌, వాలా హరీష్‌రావు, సతీష్‌రావు, మల్లారెడ్డి, రవీందర్‌ యాదవ్‌, శ్రీనివాస్‌ గౌడ్‌, బీఎస్‌ఎన్‌ కిరణ్‌, దారుగుపల్లి నరేష్‌, బాబుమియా, జంగయ్య యాదవ్‌, భద్రయ్య, అంజమ్మ, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, మరో ముగ్గురికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.